# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 8 హైదరాబాదు ఆగస్టు, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 8 Hyderabad August, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| ఆగస్ట్ 2024 | August 2024 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 121వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **విశ్వనాథ స్వామి వారి స్మృతులు ॥** | శ్రీ రవికృష్ణ శర్మ | 10 |
| **3.** | **శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** | శ్రీమతి మల్లాది ఫణిమాల | 18 |
| **4.** | **అరుణగిరిపై జ్ఞాన జ్యోతి** | సరోజా ప్రసాద్ | 22 |
| **5** | **శ్రీ రమణ యోగ సూత్రాలు** | | 27 |
| 6. | Self-Awareness | Dr K Subrahmanian | 30 |
| 7. | Ashtavakra Gita 27 | V Krithivasan | 36 |
| 9. | Feroza Taleyarkhan | Sneha Choudhury | 40 |
| 9. | Yatra - Pilgrimage | SS Cohen | 45 |
| 10. | Bhagavan's Favourite Stories: Garuda and the Sparrow | | 49 |


## Events in Sri Ramana Kendram in August 2024

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd, 30th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. 1st September - Bhagavan's Advent Day. Special Satsang will be held from 9.00 a.m. - 12.00 noon.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేసి తెలియజేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# లౌకిక సంబంధాలు

డా॥ కే.యస్. గారి 121వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

ఈ మొత్తం ప్రపంచం పరస్పర సంబంధాలపై ఆధారపడి ఉంటుంది. మనం సుఖంగా ఉండడం అనేది మనకు ఉన్న ధనం పైన గాని, పాండిత్యం పైన గాని, బంధువులు, స్నేహితులు అన్న వాటి మీద గాని ఆధారపడి ఉండదు. అది ముఖ్యంగా, మనం ఇతరులతో ఎలాంటి సంబంధాలను ఏర్పరచుకున్నామన్న దానిని బట్టి ఉంటుంది. మన వద్ద ఈ ప్రపంచములోని ధనమంతా ఉండవచ్చు. కాని, ధనాన్ని సంపాదించడానికీ, ఉన్న దానిని కాపాడుకోవడానికీ ఇతరులపై ఆధారపడవలసినదే. సంబంధాలను నిలబెట్టుకునేందుకు మనం ఇతరులపై పలు విధాలుగా ఆధారపడతాం. అందుకే కొందరిని మంచివారని, కొందరిని చెడ్డవారని అంటాము. కొందరి గురించి మనం ఎటువంటి విచారణ చేయము.

ఎవరిపట్ల ఏ విధంగా ప్రవర్తించాలి అన్నది మనం నిర్ణయించుకోవాల్సిన విషయం. ఇతరులు ఎవ్వరూ మనల్ని ఈ రీతిలోనే ప్రవర్తించాలని ఆదేశించలేరు. ఉదాహరణకు, ఎవరైనా ఫలానా చోటనే ఇంతసేపు కూర్చొని ఉండాలని నిర్బంధించారని అనుకుంటే, భౌతికంగా అలా చేయవచ్చునేమో కాని, వాళ్ళు మన మనసును అలాగ కట్టడి చేయలేరు. వ్యక్తి ఒక చోటనే ఉన్నప్పటికీ, అతని మనసు ఒకేసారి ఎన్నో ప్రదేశాలలో విహరించవచ్చు. అనేక

కారణాల వల్ల మనం శాంతిని ఆశిస్తాం. లౌకిక జీవితంలో మనం ప్రతిరోజు ఎన్నో కార్యక్రమాలు చేయాల్సి ఉంటుంది. ఆ క్రమంలో ఎందరినో కలవాల్సి వస్తుంది కూడా. అలా ప్రతి రోజూ గడపడంతో, సాయంత్రం అయ్యేసరికి ఏర్పడే ఒత్తిడి వల్ల అలసిపోతాం. మానసికంగానే కాకుండా, శారీరకంగా కూడా, తిరిగి తిరిగి అలసట చెందుతాం. అనుకున్నది జరిగినప్పుడు మనసు కొంత తృప్తిపడి నప్పటికీ, శారీరక అలసట తప్పక ఉంటుంది. ఆ విధంగా రోజులు గడవడంతో, శాంతి కొరవడి బాధపడతాం.

ఈ ప్రపంచం ఎంతో పెద్దది. కాని మనం కొన్నింటిని లేదా కొందరిని ఆదర్శంగా తీసుకుంటాం. శాంతిని కోరుకునే సందర్భాలలో ఒక గురువు కోసం అన్వేషిస్తాం. స్వాభావికంగా ప్రశాంతంగా ఉండే గురువు మనకు కొంత శాంతిని ప్రసాదించి ఆదుకుంటారని భావిస్తాం. ఆ నమ్మకంతో దరిచేరిన శిష్యులను, గురువు వారిపై దయతో అనుగ్రహిస్తాడు. తద్వారా లభించిన శాంతి, ఆనందాన్ని కలిగిస్తుంది. ఆ ఆనందం ఎంతో కాలం అలాగే ఉండి పోతుందనుకుంటాం. అలాగ జరగక పోయేసరికి, మళ్ళీ వేట మొదలౌతుంది. ఇది మానవ సహజం.

మనం గమనించాల్సిన మరొక విషయం ఏమిటంటే, ప్రతి రోజూ మనం ఆహారం తీసుకుంటాం - తిన్నప్పుడు తృప్తిగా, సంతోషంగా ఉంటుంది. అలాగే మనకు కావలసినది లభించి నప్పుడూ అంతే. కాని ఈ సందర్భాలలో ఆ ఆనందం, సంతోషం మనవరకే పరిమితమై ఉంటుంది. ఏమీ ఆశించక, ఇతరులకు ఏదైనా హృదయపూర్వకంగా ఇచ్చినప్పుడు, దానిని తీసుకున్నవారు

ఆనందిస్తారు. అది గమనించిన మనకూ ఎంతో ఆనందం కలుగుతుంది. ఇచ్చినవారికి ఆశీర్వాదం లభిస్తుంది.

ఏమీ ఆశించని సాధువులు, గురువులకు మనము ఏ పండో, ఫలమో ఇచ్చినప్పటికీ, వారు వద్దనరు. స్వీకరిస్తారు. కాని అందులో కొంత మాత్రమే పుచ్చుకుని, మిగిలినది ఇతరులకు పంచి పెడతారు. దానినే మనం ప్రసాదంగా స్వీకరిస్తాము. శ్రీ రమణ మహర్షి ఎవరినీ ఎప్పుడూ ఏమీ అడగలేదు. భక్తులు తెచ్చిన పండ్లు, ఫలహారాలు అప్పటికప్పుడు అక్కడ ఉన్న భక్తులకు పంచి పెట్టే వారు. ఆ విధంగా, ఇచ్చిన వాళ్ళను సంతోషంగా ఉంచాలని వారి ఉద్దేశ్యం.

కుటుంబంలో అయిదుగురు సంతానం ఉన్నప్పుడు, వాళ్ళందరూ తండ్రికి ఏదైనా ఇవ్వదలచుకుంటే, ఆఖరు బిడ్డ ఒక చిన్న జిలేబీ ముక్కను ఇవ్వవచ్చు. మిగతా కూతుళ్ళు, కొడుకులు ఏవైనా ఖరీదైన వస్తువులను ఇవ్వబోయినప్పటికీ, అందరికంటే చిన్నబిడ్డ ఇచ్చేదే మొదట స్వీకరిస్తారు. మరో మాటలో చెప్పాలంటే, ఇస్తున్న వస్తువు యొక్క విలువ ముఖ్యం కాదు కనుక, ఆప్యాయతతో చిన్నబిడ్డ ఇచ్చిన దానికే ప్రాధాన్యత ఉంటుంది. అది తండ్రికి అమృతతుల్యం.

అలాగే, మహాత్ములు తమకు ఎవరైనా శ్రద్ధాభక్తులతో ఏదైనా సమర్పిస్తే, అది ఎంత చిన్నదైనా సరే, దానిని వారు ఇష్టంగా స్వీకరిస్తారు. అలానే మహాత్ములు తమ వద్ద ఉన్నదానిని ఇతరులకు పంచిపెట్టడానికి ఎంతో ఇష్టపడతారు. కాని వారు దానిని పంచి పెట్టేటప్పుడు, తాము పంచుతున్నామన్న భావనతో పంచిపెట్టరు.

భగవంతుడు మనకు ఎంతో ఇస్తాడు. కాని తాను ఇంత ఇచ్చానని ఎప్పుడూ చెప్పుకోడు. ఇంకా చెప్పాలంటే, భగవంతుని కరుణ ఎంత గొప్పదంటే, ప్రస్తుతం మనం ఉన్న స్థాయికి, పరిస్థితులకు, మనమే కారణమని తలచే విధంగా చేస్తాడు. అది భగవంతుని లీల, మాయ. భగవంతుడే దీనంతటికీ సూత్రధారి అనే విషయాన్ని మనం గుర్తించం. భగవంతుడు మనల్ని తోలుబొమ్మలలా చేసి ఆడిస్తూ ఉన్నా, మనమే చేస్తున్నామన్న భావన కలిగేలా స్వాతంత్ర్యాన్ని ఇచ్చినట్లు కనిపిస్తాడు. మనకోసం కంటే కూడా, ఇతరులకు ఏదైనా మంచి చేయాలన్న ఆలోచన కలగడం కూడా భగవంతుని కరుణ వల్లనే జరుగుతుంది. అలా జరగడంలో మన గొప్పదనం ఏమీ లేదని మనం గ్రహించాలి. మనం స్వేచ్ఛగా ఉండి ఏదో చేస్తామనే భావన కంటే, పూర్తిగా భగవంతుని కృపపై ఆధారపడి ఉన్నామని తెలుసుకొనడం ముఖ్యం.

ఒక ఉన్నత శక్తిని శరణుజొచ్చినప్పుడు, మనకు ఏ విధమైన భయమూ ఉండదు. ఇది ఎల్లప్పుడూ జ్ఞప్తిలో ఉంచుకోవలసిన విషయం. భయం మన మనస్సును అచేతనం చేస్తుంది. నిజానికి, మనం మెలకువలో ఉన్న చాలా సమయం ఈ భయం, ఆ భయం అని ఏదో భయాలతో గడచిపోతుంది. అస్పష్టమైన భయాల వల్ల మనిషి చాలా అలసిపోతాడు. అన్ని పనులూ నేనే చేస్తున్నాను అని అనుకుంటేనే అలాంటి భయాలు ఏర్పడతాయి. నేను భగవంతుని చేతిలో పనిముట్టును మాత్రమేనని తెలుసుకుంటే, ఆయన ఇచ్ఛ మేరకు నన్ను వాడుతున్నాడని అర్థమవుతుంది.

కాఫీని రుచి చూసేందుకు మనం ఒక చెంచాను ఉపయోగించినా, కాఫీని రుచి చూసేది మనమే గాని, చెంచా కాదు. అలాగే మనల్ని ఒక పనిముట్టుగా వాడినప్పుడు, మనకై నిర్ధారింపబడిన విధిని నిర్వర్తించాలి. చెంచా తన పనిని తాను చేయాలి. అంతే గాని, నేను చిన్న చెంచాగా ఉంటే లేదా పెద్ద చెంచాగా ఉంటే బాగుండేది అని చింతించరాదు.

విధి నిర్వహణలో మనకై నిర్ధారితమైన పనిని చేయాలే తప్ప, మన ఇష్టానిష్టాలు చోటుచేసుకోకూడదు. కాని మనలో చాలామంది గతానికో, భవిష్యత్తులో సంబంధించిన విషయాలను గురించి ఆలోచిస్తూ ఉంటారు. దానివల్ల మన శక్తి వృథా అవుతుంది. ఆ కారణంగా మనం ఆ క్షణంలో చేయవలసిన అతి ముఖ్యమైన వాటిపై తగిన శ్రద్ధ చూపము. గతంలో జరిగిన విషయాల మీద గాని, భవిష్యత్తులో జరగబోయే విషయాల మీద గాని శ్రద్ధ చూపకుండా, ప్రస్తుతం మనమేమి చేయాలి అన్న దానిపైనే శ్రద్ధ చూపాలి. అలాగని, ఎల్లుండి జరగబోయే వాటిని గురించి ఆలోచించరాదని అర్థం కాదు. అప్పుడు మనం గణించేది గడియారం లేదా క్యాలెండరు తేదీల ప్రకారం నిర్ధారించే భౌతిక సమయం. అలా కాకుండా, ఎప్పుడో భవిష్యత్తులో ఇలా జరగవచ్చునేమోనని ఊహించుకోవటం అనేది మనం లెక్కించుకునే సమయం. ఆ సమయం వచ్చినప్పుడు దానిపై శ్రద్ధ చూపవచ్చు. భవిష్యత్తు గురించి విపరీతంగా ఆలోచించకుండా ప్రస్తుతం గురించి ఆలోచించండి.

భారతదేశం, హైదరాబాదు, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు.... ఇలా మనమన్నప్పుడు, అవి అన్నీ కూడా మన సౌకర్యం కోసం మనస్సులో మనం ఏర్పరచుకున్న కల్పితాలు మాత్రమే. అయినప్పటికీ, ఇక్కడ కొంతనో, అక్కడ కొంతనో భూమికోసం యుద్ధాలు చేసుకుంటూ, ప్రాణాలు సైతం కోల్పోవటానికి తయారవుతాము. ఇదంతా మనిషి సృష్టించుకునేదే. భారతదేశం నుండి పాకిస్తాన్ విడిపోయిందని మనం అంటాం. ఇక్కడ భూమి, అక్కడ భూమి కంటే వేరైనదా? నిజానికి ఒక పాకిస్తానీయుడికి, హిందువుకి లేదా ఒక భారతీయుడికి మధ్య భేదాన్ని గుర్తించగలమా? మనస్సు యొక్క విపరీత భావాల వల్ల, విభేదాలను సృష్టించుకొని పోట్లాడుకుంటాం.

ఉన్నత స్థాయిలో ఆలోచిస్తే అలాంటి భేదాలు ఏవీ లేవని, మన మనస్సే అలాంటి అడ్డగోడలను సృష్టిస్తుందని విశదమౌతుంది. మనమే అడ్డంకులను సృష్టించుకొని, తిరిగి వాటిని తొలగించుకోవడానికి ఇతరులతో యుద్ధం చేసి ప్రాణాలు తీస్తాం లేదా ప్రాణాలు పోగొట్టుకుంటాం. ఆ విధంగా మనం దేశ భక్తులం అని చెప్పుకున్నా, ఉన్నత స్థాయిలో నుండి అర్థం చేసుకోవలసింది ఏమిటంటే దేశ భక్తి ముఖ్యమైనది కాదు, అది ఎప్పుడూ యుద్ధానికి దారి తీస్తుంది అని.

జర్మన్ దేశస్థులు ఒకప్పుడు తాము ఉత్తమ తెగకు చెందిన వారమని భావించి, ఇతర దేశాలను అన్నింటినీ జయించాలని తలంచారు. ఇది కూడా మానసిక భ్రమయే. దాదాపు యాభై సంవత్సరముల నుండి జాతీయత, అంతర్జాతీయతల గురించి మాట్లాడుతున్నారు. ఆధ్యాత్మికపరంగా ఆలోచిస్తే, ప్రజల జాతీయత

ఏదైనప్పటికీ, మానవులందరూ ఒకటే. ప్రపంచ రాజకీయాలను గురించి అతిగా ఆలోచించే వాళ్ళు ఇలాంటి ధోరణులను అనుసరిస్తారు. నివసిస్తున్న నేలతో మమేకమై అలాంటి భావాలను పెంచుకుంటారు. లోలోపల అది మంచిది కాదని తెలిసినప్పటికీ, దానిని బహిర్గతం చేయరు.

అందుకే మన పూర్వజులు మొదటే 'వసుధైవ కుటుంబకం' అంటూ వచ్చారు. మునులు, ఋషులు ఉన్నత స్థాయిలో మానవజాతి నంతటినీ ఒకటిగా భావించి, మన కుటుంబం, మన జాతి, మన దేశం అని కాకుండా, ప్రపంచం అంతా మన కుటుంబ మేనన్న భావన కలిగి ఉండేవారు. ఎవరిపట్ల విరోధ భావన ఉండేది కాదు.

ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు ముఖ్య కారణం భయం. ప్రక్క వాడంటే భయం, పొరుగు దేశం అంటే భయం, మన కుటుంబం గురించిన భయం, పిల్లల గురించి భయం, భవిష్యత్తులో ఏమౌతుందో నన్న భయం... ఇలా ఎన్నో. సాధన చేస్తూ భగవంతుని శరణు జొచ్చి ఆత్మ విచారణ జరిపితే, కొంత కాలానికి ఏ భయాలూ లేకుండా ఉండగలం. భయం తగ్గే కొద్దీ ఆనందం నెలకొంటుంది. శక్తిమేర పని చేస్తూ అది నేనే చేశానన్న భావన లేకుండా ఉంటే, చింతలు ఉండవు. మనం భగవంతుని చేతిలో పనిముట్లము మాత్రమే. చెంచా రుచి ఎరుగదు, దానికి ఇష్టానిష్టాలు ఉండవు అనేది గుర్తుంచుకోవాలి. ఎవరైతే ఈ విశ్వంతో మమేకమై ఉంటారో, వారి ఆలోచనా విధానం అలాగే ఉంటుంది.

******

# విశ్వనాథ స్వామి స్మృతులు II

# భగవాన్ సన్నిధిలో

**శ్రీరమణాశ్రమ ప్రచురణ Surpassing Love and Grace లోని రెండవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ రవికృష్ణ శర్మ**

భగవాన్ జయంత్యుత్సవాలకు హాజరైన భక్తులు ఆశ్రమమును వీడి వెళ్ళిన తరువాత, నేను భగవాన్‌ను సమీపించి, నా సమస్యను వారితో ఈ విధంగా నివేదించాను. నేను ఏ విధంగా నాలోని పశుభావాన్ని వీడి, ఉన్నతమైన స్థితిని పొందగలను? పశు ప్రవృత్తిని వీడి ఉన్నతమైన స్థితిని పొందాలని నేను ఆ మార్గంలో చేసిన ప్రయత్నాలన్నీ వృథా అని నేను గుర్తెరిగా, నన్ను నేను ఈ విధంగా సమాధానపరచుకున్నాను - ఏ శక్తి అయితే నన్ను ఇక్కడికి తీసుకుని వచ్చిందో ఆ మహత్తర శక్తి మాత్రమే నన్ను మార్చగలదని.

ఇది విని భగవాన్ గొప్ప అనుగ్రహ వీక్షణాలతో "అవును, నీవు చెప్పింది నిజం. ఎప్పుడైతే ఈ మహత్తరమైన శక్తి ఒకరిలో మేలుకుంటుందో అప్పుడు మాత్రమే అతి బలిష్ఠమైన, నిరోధించటానికి కష్టమైన, ఇంద్రియ మరియు మనో వ్యాపారములు, అతని యందు అణిచివేయబడతాయి. ఎప్పుడైతే నీవు ఆ మహాశక్తిని నీలో మేలుకొలిపి, పెంచి పోషించ గలుగుతావో, అప్పుడు ఆ శక్తి ద్వారా మిగిలిన అన్ని వ్యవహారాలూ నిర్వహింప బడుతున్నాయని గ్రహిస్తావు. ఈ స్థితిని పొందుట కొరకు ఒక నిరంతర ధ్యానం మనలో జరుగుతూ ఉండాలి. ఆ స్థితిని సాధించ

టానికి మితాహారం, హితాహారం మరియు ఇంద్రియ నిగ్రహం లాంటివి మనలోని ప్రశాంతతను నిలిపి ఉంచటానికి చాలా సహాయకాలుగా ఉంటాయి అని అన్నారు. ఈ విధమైన అనుగ్రహ వాక్యాలు నా ఆధ్యాత్మిక పురోగతికి నాంది పలికాయి. వారి మాటలు నాలో ఒక నూతనమైన విశ్వాసాన్ని పాదుకొలిపాయి. అలాగే భగవాన్ ఎప్పటికీ నా ఆధ్యాత్మిక ఉన్నతికి సహాయకుడు గాను మరియు మార్గదర్శిగాను ఉంటారని నాకు బలంగా అనిపించింది.

మరియొక రోజున, నేను భగవాన్ ను బ్రహ్మచర్యం గురించి ప్రశ్నించినప్పుడు, భగవాన్ ఈ విధంగా సమాధానం చెప్పారు. ''బ్రహ్మముగా ఉండి, బ్రహ్మముతో చరించటమే నిజమైన బ్రహ్మచర్యం అంటే'' అని అన్నారు. బ్రహ్మమును పొందాలంటే, ఇంద్రియ నిగ్రహం చాలా సహాయకంగా ఉంటుంది. ఇది అతి ఆవశ్యకము కూడా. కాని ఎప్పటి వరకు నిన్ను నీవు ఒక శరీరానికే పరిమితం చేసుకుంటావో, అప్పటివరకు నీలో కలిగే శృంగార భావనల నుండి మరియు ఇతర ఇంద్రియ లౌల్యముల నుండి నీవు తప్పించుకొనలేవు. నీవు ఎప్పుడైతే ప్రయత్నరహితంగా, అనుభవపూర్వకంగా తెలుసుకుంటావో, అప్పుడు మాత్రమే నీలో కలిగే శృంగార భావనలు నిన్ను వీడుతాయి లేదా కనపడకుండా పోతాయి. దానినే బ్రహ్మచర్యం అని అంటారు. అప్పుడు బ్రహ్మము ప్రయత్నరహితంగా, తనంతట తానే అప్పటికప్పుడు ప్రకాశిస్తుంది అని అన్నారు.

ఒక వారం తరువాత, భగవాన్ నాకు మధుకర వృత్తితో జీవించటానికి అనుమతినిచ్చారు. ఈ సందర్భంగా భగవాన్ నాతో ఇలా అన్నారు. భిక్షాటనతో జీవించిన అనుభవం నాకున్నది. నేను పవలకున్రులో ఉంటూ ఉండగా, భక్తులు నా కోసం తెచ్చే రుచికరమైన, ప్రత్యేకమైన ఆహార పదార్థాల నుండి తప్పించుకొనుట కొరకు నేను భిక్షాటనతో జీవించే వాడిని. ఇది భిక్షాటననే వృత్తిగా ఎంచుకున్న వారితో పోలిస్తే భిన్నమైనది. ఇక్కడ నీవు ఎవరి మీదా ఆధారపడకుండా ఉన్నట్లుగా మరియు ప్రపంచంలో జరిగే సంఘటనలతో ఎటువంటి సంబంధం లేనివాడిగా అనుభూతిని చెందుతావు. ఈ విధమైన భిక్షాటన మనస్సును శుద్ధ పరుస్తుంది. మనస్సును శుద్ధం చేసే శక్తి భిక్షాటనకు ఉంటుంది.

నాలుగు నెలల తరువాత నా తల్లితండ్రులు భగవాన్‌ను దర్శించి నన్ను వారితో తీసుకొని పోవటానికి అరుణాచలం వచ్చారు. నన్ను తీసుకొని పోవటంలో వారి ప్రయత్నాలు ఏవి కూడా సఫలం కాలేదు కాని, భగవాన్ నా తల్లితండ్రులను ఏదో విధంగా ఓదార్చటం వలన వారు తిరిగి వెళ్ళిపోయారు. భగవాన్ వారిని వెళ్లే ముందు ఈ విధంగా అడిగారు. ఒక వ్యక్తి తన మనస్సుని, హృదయాన్ని ఒక నిర్ణీత మార్గములో ఉన్నత లక్ష్యం చేరుకోవటానికి ప్రయత్నిస్తున్నప్పుడు అతనిని ఆ మార్గం నుండి తప్పించటం భావ్యమా అని. తల్లితండ్రులు, తమ పిల్లలు నడిచే మార్గము సరియైనదా కాదా అనేది తమ కర్తవ్యంగా భావించి వారు ఆ మార్గాన్ని కొంత

అనుసరిస్తారు. ఒకవేళ, ఒక వ్యక్తి నడిచే మార్గము ఆంతరంగికంగా ఉన్నత స్థితికి తీసుకుని పోయేదైతే ఏ సమస్య ఎదురు కాదు.

నా తండ్రి భగవానుకు బావ అవుతారు. వారు భగవాన్ కంటే 4 లేదా 5 సంవత్సరములు పెద్దవారు. భగవాన్ ఇంటిని వదిలి తిరువణ్ణామలైకు రాక పూర్వం, వెంకట్రామన్‌గా ఉన్నప్పుడు బాగా తెలుసు. ఇతరుల ద్వారా భగవాన్ పొందిన ఆధ్యాత్మిక ఉన్నత స్థితిని గురించి విన్నప్పటికీ, అలాగే భగవాన్‌ను స్తుతిస్తూ వారి భక్తులైన కావ్యకంఠ గణపతుల వారు వ్రాసిన శ్రీ రమణ గీతను చదవటం వల్ల వారి బోధలను తెలుసుకున్నప్పటికీ / అర్థం చేసు కున్నప్పటికీ, నా తండ్రికి భగవాన్ గురించి ఇంకా కొంచెం శంక ఉన్నది. అందువల్ల నేను అక్కడకు వెళ్ళినప్పుడు, భగవాన్ ఏ విధంగా ప్రతిస్పందిస్తారోనని మనస్సులో అనుకున్నారు. కాని, భగవాన్‌ని ఎప్పుడైతే రాతి మంటపంలో (ఆశ్రమమునకు ఆవలి వైపు ఉన్నది) చూశారో, భగవాన్ యందు ఒక గొప్ప గౌరవభావం ఉప్పొంగి భక్తి భావంతో వారి పాదాలకు సాష్టాంగనమస్కారం చేసి నిలుచుని ''నేను చూచిన లేదా నాకు బాగా తెలిసిన ఆ వెంకట్రామన్ ఇప్పుడు వీరిలో లేరు'' అని అన్నారు. అప్పుడు భగవాన్ ''ఆ వెంకట్రామన్ అనే వ్యక్తి ఎప్పుడో చాలాకాలం క్రితమే మరెప్పటికీ కనిపించకుండ పోయాడు'' అని అన్నారు.

అప్పుడు నా తండ్రి, భగవాన్ దగ్గరకు ఇంతకాలం ఎందుకు రాలేకపోయారో వివరణ ఇస్తూ ''నాకు ఇంకా సంబంధ బాంధవ్యాల నుండి వ్యామోహం తీరకపోవటం వల్ల ఇంతకాలం రాలేకపోయాను

అని అన్నారు. ఇప్పుడు భగవాన్ "అలాగా? నీవు చాలా గాఢమైన వ్యామోహములో కూరుకొనిపోయి, ఆత్మ సాక్షాత్కారాన్ని ఇప్పుడు కాదు, ఎప్పుడో చాలాకాలం తరువాత పొందదగినది అని అనుకుంటున్నావు. కాని నీవు నీ సహజ స్థితిని గుర్తిస్తే, నీవు దేనితో సంబంధం కలిగి ఉన్నావో, దేని నుండి విడివడాలనుకుంటున్నావో నీకే తెలుస్తుంది. ఇంద్రియాల ద్వారా లేదా మనస్సు ద్వారా తెలియబడే దేనితోనూ మనకు సంబంధం లేకపోవటం మన నిజమైన సహజస్థితి అని నీవు తెలుసుకుంటావు" అని భగవాన్ నా తండ్రితో అన్నారు.

ఆశ్రమ కుటీరాన్ని బాగుచేస్తున్నారు కనుక, భగవాన్ ఆశ్రమాన్ని వీడి, నడకదారికి ఆవల ఉన్న రాతి మంటపంలోకి మారారు. పగటిపూట భక్తులందరూ భగవాన్ని అక్కడే దర్శించుకునేవారు. ఆశ్రమానికి సమీపంలో ఉన్న ఒక పెద్ద మామిడి చెట్టు నీడన అందరూ భగవాన్‌తో కలసి భోజనం చేసేవారు. ఆశ్రమములోని చల్లని, స్వచ్ఛమైన బావిలోని నీటిని పెద్ద పెద్ద కుండలలో నింపి, ఆ మామిడి చెట్టు మూలమున ఉంచేవారు. ఆ చెట్టు నీడన మేమందరము, భగవాన్ చల్లని, అనుగ్రహపూర్ణమైన కరుణావీక్షణ దృక్కుల యందు మా తాపములను పోగొట్టుకొని ఎంతో ఆనందంగా జీవించేవారము.

భగవాన్ యొక్క సలహాను అనుసరించి, నేను నిద్రించే టప్పుడు తప్ప, పగలు, రాత్రి అని తేడా లేకుండా, నిరంతరం జపం చేస్తూ ఉండేవాడిని. అలాగే శ్రీ రమణ గీతను భగవాన్

సమక్షంలో కూర్చుని, ప్రతీ శ్లోకాన్ని భగవాన్ వివరిస్తూ ఉండగా రసాస్వాదన చేసేవాడిని. అప్పుడు భగవాన్, అరుణాచలుడిని భక్తితో స్తుతిస్తూ పాడిన స్తోత్రాలను నాకు వివరించేవారు. అలాగే వారు ప్రతీరోజు ఉదయము, సాయంత్రము నడిచే కొండ మార్గంలో నేను వారిని అనుగమించేవాడిని. ఆ సమయంలో, వారు ఎన్నో విషయాలను, అరుణాచలేశ్వరుణ్ణి స్తుతిస్తూ పాడిన పాటలను చాలా అనుభూతి చెంది చెబుతూ ఉండేవారు. అలాంటి సందర్భాలలో, ఒక ఉదయం నేను ఒక్కడినే భగవాన్‌తో ఉన్నాను. అప్పుడు భగవాన్ "మనిద్దరము ఇప్పుడు ఇంకొకరు గుర్తించి మనల్ని వెదికేలోపు, అరుణాచల గిరి ప్రదక్షిణ చేసి వద్దాము" అని అన్నారు. వారు నన్ను అడవి మార్గం గుండా తీసుకుని పోతూ, ఆదిశంకరులు దక్షిణామూర్తిని స్తుతిస్తూ వ్రాసిన దక్షిణామూర్తి స్తోత్రమును గురించి మాట్లాడుకుందాం అని నాకు సూచించారు. మేము మూడు గంటలలో అరుణాచలం కొండ వాలులో, ఆశ్రమానికి తూర్పు భాగాన ఉన్న పాండవ తీర్థానికి చేరుకున్నాము. భగవాన్ అక్కడ ఇంతకు మునుపు కొన్ని సందర్భాలలో స్నానం చేసేవారు. భగవాన్ దక్షిణామూర్తి స్తోత్రాలను గురించి వివరించినది అంత బాగా అవగాహన చేసుకున్నానని చెప్పను కాని, భగవాన్‌తో ఆ కొన్ని గంటల సాన్నిధ్యాన్ని, ఏకాంతతను, ఆధ్యాత్మిక చైతన్యపు కాంతిని నేను బాగా ఆస్వాదించగలిగాను. అది చాలు అనిపించింది.

నేను భగవాన్ దగ్గరికి రాకమునుపే తైత్తిరీయ ఉపనిషత్ లోని మూడు భాగాలను, (శిక్షావల్లి, ఆనంద వల్లి, భృగువల్లి) కంఠస్థం

చేశాను. ఈ ఉపనిషత్తును ఈ నాటికి కూడా ఆశ్రమము నందు, భగవాన్ ఎదుట పారాయణ చేస్తారు. నేను భగవాన్‌తో, ఈ ఉపనిషత్ యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్న ఉత్సుకతను వ్యక్తం చేశాను. అప్పుడు భగవాన్ నన్ను అరుణాచల కొండ భాగంలోని చూతగుహలో నివాసముంటున్న, ప్రాచుర్యంలో నాయన అని పేరు కలిగిన గణపతి ముని గారి వద్దకు వెళ్ళమని సూచించారు. ఒకప్పుడు భగవాన్ విరూపాక్ష గుహలో నివాసముండే సమయంలో, ఎండాకాలములో ఈ చూతగుహలో కొంత చల్లగా ఉంటుందని, తమ విడిదిని అక్కడకి మార్చేవారు.

ఈ చూతగుహ ఒక పెద్ద మామిడి చెట్టు క్రింద ఉండటం వలన చాలా చల్లగాను మరియు దానికి కొంత ఎత్తులో/పై భాగంలో ఒక జలధార తెల్లటి స్వచ్ఛమైన నీటితో కొండ పై భాగం నుండి జాలువారుతూ ఉండేది. నేను ఆ చూతగుహకు వెళ్ళి, గుహకు వెలుపలి భాగాన కొంతసేపు ఉన్నాను. నేను వెళ్ళిన కొద్ది నిమిష ములలో గణపతి ముని గారు బయటకు వచ్చారు. అక్కడ వారి నివాసం చేత, వాతావరణం అంతా తపో సుగంధంచే పరివ్యాప్తమై ఉన్నది. వారి సమక్షంలో కాసేపు మౌనముగా కూర్చున్న తరువాత నేను తైత్తిరీయ ఉపనిషత్ యందుగల ఒక భాగంలోని “అహం వృక్షస్య రేరివా” అంటే ఈ వృక్షం ఉనికికి మూలకారణం దాని వెనుక నున్న శక్తినే ‘నేను’ అని అన్న ముని త్రిశంకు అనుభవాన్ని వివరించవలసినదిగా కోరాను. నాయన గారి వివరణ, జ్ఞానంతో కూడి ప్రకాశవంతమైన, చాలా తేలికగా మరియు సూటిగా

అర్థమయ్యే విధంగా ఉండటంతో, నేను ఇంక ఎటువంటి సందేహాలు అడగవలసిన అవసరం లేదని నిశ్చయించుకున్నాను. వారి ముఖము నుండి వెలువడే ప్రతి మాట, శాస్త్రం తెలియజేస్తున్న అర్థాన్ని మరియు స్వచ్ఛతను మరింత ఇనుమడింప చేస్తున్నాయి. అంత శాస్త్రజ్ఞానం మరియు తపశ్శక్తి కలిగి ఉన్నప్పటికీ, వారిని దర్శించే ప్రతీ ఒక్కరినీ, భగవాన్‌ను దర్శించటం వలన కలిగే ఒక ప్రత్యేకమైన అనుభవ పూర్వకమైన ఆనందాన్ని చవి చూడవలసినది అని పంపేవారు. అదే విధంగా భగవాన్, వారిని దర్శించేవారిని, శాస్త్ర సమ్మతంగా పూజించేవారికి ఎప్పుడైనా సందేహాలు ఎదురైతే నాయన గారిని దర్శించి వారి సందేహాలను తీర్చుకోమనేవారు. ఎందుకంటే వారికి శాస్త్రం మీద పట్టు ఉన్నది కనుక. అటువంటి అనుబంధం గురువుకు మరియు గొప్ప ప్రాముఖ్యతను పొందిన భక్తుడికి మధ్యన ఉండేది. భగవాన్ కు, గొప్ప శాస్త్ర జ్ఞానం కలిగిన పండితులైనటువంటి నాయనగారి యందుగల ఒక ప్రత్యేకమైన గౌరవంతో కూడిన అభిమానాన్ని మేము ఎన్నో సందర్భాలలో గమనించే వారము. నాయనగారు తమ చిన్నతనం నుండే తపస్సుకు తన జీవితాన్ని అంకితం చేశారు.

******

## శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# స్వామి ముక్తానంద

**శ్రీమతి మల్లాది ఫణిమాల**

స్వామి ముక్తానందులవారు బొంబాయికి దగ్గరలో ఉన్న గణేష్ పురి ఆశ్రమ స్థాపకులు. గొప్ప రమణ భక్తులు కూడా... స్వామి ముక్తానందుల వారు 16 మే 1908వ సంవత్సరంలో జన్మించారు. శ్రీ నిత్యానంద స్వామివారి అగ్ర శిష్యులలో ఒకరైన వీరు, 'సిద్ధ యోగాభ్యాసం' వ్యాప్తి చెందడానికి కారణభూతులయ్యారు. వీరికి తల్లిదండ్రులు ఒసగిన నామధేయము కృష్ణ రాయ్. స్వామి ముక్తానందుల వారు కాశ్మీర్ శైవసిద్ధాంతము, వేదాంతము మరియు కుండలినీ శక్తి వంటి ఎన్నో అంశాలపై గొప్ప గ్రంథాలను రచించి ప్రపంచానికి అందించారు.

ఆధ్యాత్మిక అన్వేషణను జీవితాంతం కొనసాగిస్తున్న అనేకులైన సాధువులను, స్వాములను, గురువులను మోక్షకాంక్ష ఉన్న ప్రతి మానవుడు దర్శించుకుంటూనే ఉంటాడు. కానీ శ్రీ రమణులు ఆవిష్కరించినట్లు సాధకులకు సత్యాన్ని ఎవ్వరూ సుస్పష్టంగా, సూటిగా చూపలేకపోయారన్నది నూటికి నూరుపాళ్ళు నిజం! అంతే కాకుండా, తమ పాదాల వద్దకు చేరిన ఎందరెందరో భక్తులను, సాధకులను మహర్షి తమ దివ్య వీక్షణంతో తామున్న స్థితిలోనే వారిని కూడా నెలకొల్పారు. ఈ విధంగా శ్రీ రమణులను దర్శించుకుని తరించిన వారిలో స్వామి ముక్తానందుల వారు ఒకరు.

స్వామి ముక్తానందుల వారి మాటలలో శ్రీ రమణుల వైభవాన్ని తిలకిద్దాం...

వేదాంతం ప్రకారం 'ఆత్మ' తప్ప తెలుసుకోవలసినది కానీ, ఎరుగ వలసినది కానీ, వినవలసినది గానీ, చూడవలసినది గానీ ఏదీ లేదని ఎలుగెత్తి చాటిన గొప్ప జ్ఞాన గురువులు శ్రీ రమణ మహర్షుల వారు. ఆరాధించవలసిన దైవమంటూ ఎవరైనా ఉంటే, అది కేవలం ఆత్మ మాత్రమేనని, ఆత్మ యొక్క ఆరాధనను, ఆత్మ ఎఱుకను ప్రప్రథమంగా ఆధ్యాత్మిక ప్రపంచానికి ఆవిష్కరింప చేసిన వారు శ్రీ రమణ గురువులు. ఇందుమూలముగానే సద్గురు రమణులను 'లోకమహాగురువు'గా కీర్తించి కొనియాడడం జరుగుతోంది.

వారు కేవలం ఒక్క కౌపీనాన్ని మాత్రమే ధరించి ఉన్నప్పటికీ, ఎంతో విలువైన దుస్తులను ధరించే రాకుమారుల కంటే దర్జాగానూ, ఆకర్షవంతంగానూ గోచరించేవారు. మా గురువుగారైన నిత్యానందుల వారు దీనికి కారణం ఎంతో చక్కగా వివరించారు:

"శ్రీ రమణులు వేయి భాస్కరుల కాంతితో మెరిసిపోవటానికి కారణం, వారు దేహాత్మ భావనారహితులుగా ఉండటమే. అంతే కాకుండా వారు గుణాతీతులు మరియు ద్వంద్వాతీతులు కూడా" అని స్వామి నిత్యానందుల వారు శ్రీరమణులను కొనియాడేవారు.

దేహాత్మ భావనారహితులుగా ఉండటం అంటే, శ్రీ రమణులు దేహం కన్నా పై తలంలో ఉండేవారని అర్థం. వారికి దేహానికి సంబంధించిన బాధ కానీ సుఖం కానీ లేనేలేదు. అందుకనే వారి

దేహానికి శస్త్ర చికిత్స చేసినా కూడా, వారికి ఏ విధమైనటువంటి బాధ అనుభవంలోనికి రాలేదు. వారి దేహాతీతమైన స్థితిని చూసి వైద్యులు ఆశ్చర్యచకితులయ్యారు. నిజానికి ఈ దేహాతీతమైన స్థితి మనబోటి సాధారణమైన సాధకులకు, సగటు మానవులకు అందు బాటులో ఉండదని స్వామి ముక్తానందుల వారు అన్నారు.

శ్రీ రమణుల సన్నిధికి వచ్చి చేరిన ప్రతి ముముక్షువుకు, ఏ దాపరికము లేకుండా ఆత్మ పట్ల ధ్యానమగ్నమై ఉండమని ప్రబోధించిన గొప్ప గురువు గారు. ఆత్మసాక్షాత్కారం పొంది, ఆత్మగా వెలుగొందటమే శ్రీ రమణుల బోధలోని ముఖ్యాంశము. సర్వాతీత మైన చైతన్య స్థితిలో సదా ఓలలాడే శ్రీరమణులు పరిపూర్ణ విరాగులు అని, వారి సన్నిధానంలో మూడు రోజులు గడిపే అవకాశం అనుగ్రహింపబడ్డ స్వామి ముక్తానందులవారు గ్రహించారు. శ్రీ రమణుల సన్నిధానానికి వెళ్ళిన ఎటువంటి వారైనా, సర్వదా వారు రమించే సర్వాతీత స్థితిని గ్రహిస్తారు. వారిని సమీపించిన భక్తులలో కొంతమంది శ్రీ రమణులు సిద్ధులనీ, మహా యోగులనీ అభిప్రాయపడితే, మరికొందరు వారు సాక్షాత్ భగవదవతారులని అంటారు. ఆ స్థితి యొక్క దివ్యత్వం వల్లనే, వారి వద్దకు ఎవరు వెళ్లినా శ్రీ రమణులు తమ స్వంతమనే అనుకుంటారు. వారు అందరికీ చెందినవారు... అదే విధంగా అందరూ శ్రీ రమణులకు చెందినవారే.

ఇక మహర్షి ఉపదేశించిన 'ఆత్మ విచార మార్గం' గురించి చెప్పాలంటే, అది సర్వకాల సర్వావస్థల యందు అందరికీ అందుబాటులో ఉండే ఒకానొక గొప్ప సాధన. ఆత్మవిచార మార్గం

అనే సాధనను నిత్యం కొనసాగించటానికి ఏ అడ్డంకులు, అవరోధాలు ఏర్పడవు. ఎందుచేతనంటే 'ఆత్మ' ప్రతి చోటా ఉంటుంది. కొందరికి ఆ బోధ అతి ప్రాచీనంగా అనిపిస్తే, మరికొందరికి అత్యంత ఆధునికంగా అనిపిస్తుంది. ఆధ్యాత్మ ప్రపంచంలో 'మనసు' అనబడే మాయను ఛేదించడానికి ఈ మార్గం ఒక విప్లవాత్మకమైన బోధనగా మరికొందరికి తోచవచ్చు.

"నిజానికి శ్రీ రమణులు బోధించిన ఆత్మ విచార మార్గము, ప్రాచీనము మరియు నవీనము కూడా. అందుకే ప్రపంచానికి ఇంతటి గొప్పదైన మోక్షమార్గాన్ని అందించిన శ్రీ రమణులు గురువులకే గురువైనారు.. అరుణాచల ఋషిగా కీర్తించబడ్డారు!" అని స్వామి ముక్తానందుల వారు తరచూ శ్రీ రమణులను వేనోళ్ళ కీర్తించేవారు. అంతేకాకుండా శ్రీ రమణులను ఆరాధించిన వారికి భక్తి, యోగము, జ్ఞానము అనబడే మూడు సాధనముల వల్ల కలిగే పరమానందము అనుగ్రహింపబడుతుందని స్వామి ముక్తానందుల వారు అన్నారు. స్వామి ముక్తానందుల వారు 1982వ సంవత్సరం అక్టోబర్ రెండవ తేదీన శివైక్యం చెందారు.

ఇలా మహా భక్తులు, మహనీయులు అయిన స్వామి ముక్తానందుల వారి వలె ఎందరెందరో భక్తులు, ముముక్షువులు, సాధకులు మన సద్గురు రమణులను కీర్తిస్తూ, స్తోత్రం చేస్తూ, ఆవిష్కరించిన పద కుసుమములను చదివి, వాటి అంతరార్థాన్ని భావన చేయగలగడం నిజంగా శ్రీ రమణులు మనపై వర్షించే అనుగ్రహానికి చిహ్నము. భక్తులకు ఇది ఒక మహోన్నతమైన ఆశీర్వాదము.

# అరుణగిరిపై జ్ఞానజ్యోతి

**శ్రీరమణాశ్రమ ప్రచురణ Fragrant Petalsలోని మూడవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: సరోజా ప్రసాద్**

(ఈ వ్యాస రచయిత రామవర్మ అప్పన్ తంపురాన్, కొచ్చిన్ రాజ వంశీకుడు. మలయాళంలో ప్రసిద్ధ రచయిత. ఉపనిషత్తులను సైతం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వ్యక్తి. 1930వ దశకంలో భగవాన్ చెంతకు వచ్చారు. భగవాన్ సన్నిధిలో ఆయన ధ్యాన మగ్నుడై కూర్చుండిపోవడంతో, ఒక రోజు భోజనం వేళ కూడా తప్పిపోయిందట.

రమణులంటే ఆయనకు ఎనలేని భక్తి. మలయాళంలో, భగవాన్ చరిత్ర వ్రాసిన శ్రీ అప్పున్ని, తన పుస్తకానికి పరిచయ వాక్యాలు వ్రాయవలసినదిగా శ్రీ తంపురాన్ ను కోరారు. శ్రీ తంపురాన్ వ్రాసిన పరిచయ వ్యాసాన్ని, భగవాన్ ఎంతో మెచ్చుకున్నారు. ఇది అనేక భాషలలోకి అనువాదమైంది కూడా. ఈ వ్యాసం లోని, కొన్ని భాగాలు, ఇక్కడ అందిస్తున్నాము).

మనస్సుకుండే శక్తియుక్తులు అపారం. ఒక్కోసారి ఉత్సాహ ఉద్వేగాలతో పైకెగస్తుంది. మరోసారి నిశ్చలంగా నిలుస్తుంది. అదే విధంగా, దేన్నైనా కట్టడి చేస్తుంది. దాని శక్తికి హద్దులు లేవు. సుఖదుఃఖాలకైనా, ఆనందానుభవానికైనా, మోక్షానికైనా కారణం మనస్సే. నిరంతరం మారిపోయే మనస్సు నిజస్థితిని అర్థం చేసుకుంటే, జాగ్రదావస్థగా భావించే కాల్పనిక స్వప్నం తాలూకు

అసలు స్వభావం మనకు బోధపడుతుంది. 'సంసారం' అనేది మనస్సు చేసే మాయ అని గ్రహించగలిగితే, జనన మరణ చక్రం గురించిన రహస్యం మనకు తేట తెల్లమవుతుంది. మనస్సు తాలూకు ఈ మూలస్వభావాన్ని, ఎన్నో శాస్త్రాలు నిర్వచించాయి, నిర్ధారించాయి. కేవలం అనుభవం ద్వారా మాత్రమే, ఈ సత్యాన్ని అవగతం చేసుకోగలం.

దుఃఖాన్ని దూరం చేసుకొని, సంతోషంగా ఉండాలనే ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. అందుకోసం ఎంతైనా శ్రమిస్తారు. మనస్సు స్థితి గతులను శోధించే తత్త్వవేత్తలైనా ఇందుకు మినహాయింపు కారు. అయితే, మనస్సు నిజరూపం కోసం అన్వేషించవలసినది మనలోపలే కాని ఇతరులలో కాదని, మన సుఖదుఃఖాలకు కారణం మనలోనే ఉన్నదని తెలిసినవారు అరుదు. కొద్దిమంది మాత్రమే ఆత్మ విచారణ చేస్తారనుకొంటే, వారిలో ఆత్మ సాక్షాత్కారం పొందిన వారిని వేళ్ళమీద లెక్కించవచ్చు.

శ్రీ కృష్ణ పరమాత్మ జ్ఞాన విజ్ఞాన యోగంలో చెప్పినట్లు, తనను తెలుసుకోవడానికి ప్రయత్నించే అనేకమంది సిద్ధులలో, ఏ ఒక్కరికో మాత్రమే ఆ పరమాత్మ స్వరూపం తెలియవస్తుంది. అది అక్షర సత్యం.

స్వరూప జ్ఞానం పొందే మార్గం సులభసాధ్యం కాదు - బహు కష్టతరం. అసామాన్య శక్తులను సాధించిన సిద్ధ పురుషులు సైతం, ఈ జ్ఞానం పొందారని చెప్పజాలము. ఇంతటి దుస్సాధ్యమైన ఆత్మ సాక్షాత్కారం పొందిన జ్ఞానిని కొనియాడతరమా?

మహర్షికి, ఈ ఆత్మ సాక్షాత్కారం హఠాత్తుగా అనుభవమైంది. స్వరూప జ్ఞానం మెరుపులా ప్రకాశించింది. కర్మ పరిపక్వమయ్యే సరికి, 'నేనెవరు?' అన్న ఆత్మ విచారణకు సమాధానం లభించింది. అరుణాచలేశ్వరుడి పవిత్ర నామం యాదృచ్ఛికంగా వారి చెవిన పడటం, దరిమిలా వారికి కలిగిన మరణానుభవం - ఇవి సందర్భ వశాత్తు జరిగిన సంఘటనల్లా కనిపించినా, అవి రమణుల ఆత్మసాక్షాత్కారానికి దోహదం చేశాయనడంలో సందేహం లేదు.

వారికి ఎటువంటి కఠోర తపస్సు చేయవలసిన అవసరం రాలేదు. సంసార చక్రం నుండి విడివడి, శుద్ధ స్వరూప దర్శనం పొందడానికి వారు ఎటువంటి ప్రయాసపడలేదు. సర్వాంతర్యామి అయిన ఆ పరమేశ్వరుడే, రమణులను ఆ శుద్ధ చైతన్యం యొక్క కేంద్రంలో ప్రతిష్ఠించాడని చెప్పవచ్చు. ఈ స్వరూప జ్ఞానం కలిగిన వెంటనే కనులు తెరచిన రమణులకు, ఈ చరాచర ప్రపంచమంతా ఆ పరంజ్యోతి ప్రకాశంతో నిండినట్లు అనిపించింది. ఆ విధంగా, క్షణ మాత్రాన ఆత్మ స్వరూపం తెలుసుకొని బంధ ముక్తులైన రమణులకు ఏకాంత జీవనం, అసంగత్వం, ఆత్మ విచారణ, సత్యాన్వేషణ - ఇలాంటి ప్రక్రియలన్నీ కేవలం చేదోడుగా మిగిలాయి.

తుఫానులు వచ్చినా, సముద్రాలు ఉవ్వెత్తున పొంగినా, భూకంపాలే సంభవించినా, అరుణగిరిపై వేళ్లూనుకొన్న జ్ఞాన వృక్షం మాత్రం, ఏ మార్పు లేకుండా, నిశ్చలంగా నిలిచి ఉంటుంది. జీవన యాత్రలో అలసిన పాంథులనేకులు ఈ తరుచ్ఛాయలో విశ్రమించి

సేదతీరుతారు. ఈ తరు శాఖలపై నుండి, భక్తుల వంటి పక్షులు అనేకం తన్మయ గీతాలను వినిపిస్తాయి. పరమానందభరితమైన లోకం అంటే ఇదే కదా!

గమ్యం ఒకటే గాని, దృక్పథాలు అనేకం. లక్ష్యం ఒకటే గాని, అక్కడికి దారి తీసే మార్గాలు అనేకం. లక్ష్యాన్ని చూసే కనులకు చూపుండదు. మార్గం మొత్తం అంధకారబంధురం. జ్ఞానులు నడచిన ఆ దారులు, ఎటు వెళతాయో ఎవరికీ తెలియదు. కష్టం ఏమిటో, సుఖం ఏమిటో, ధర్మం ఏమిటో, అధర్మం ఏమిటో, కర్మ ఏమిటో, అకర్మ అంటే ఏమిటో పరిశోధించి తెలుసుకున్నాక మన జీవితాలను ధర్మబద్ధంగా తీర్చిదిద్దుకోవడం కష్టతరమే. మాయజాలంలో చిక్కుకోకుండా, ఒక్క అడుగు ముందుకు వెయ్యడం కూడా సామాన్యులకు సాధ్యం కాదు. పాంచభౌతికమైన ఈ శరీరం, సకల రోగాలకు ఆలవాలం. మనస్సు చూస్తే చంచలం. బుద్ధి ఏమో పరిమితం. ముందు విషంవలె కనిపించేది, చివరికి అమృతం అని తెలుస్తుంది. విభిన్న దృక్పథాలలో అనేకంగా తోచే సత్యం ‘‘ఏకమే’’ అని గ్రహిస్తాము.

బహుశః ఈ కారణం వల్లనే కావచ్చు, భగవాన్ బోధలలో, స్వరూప జ్ఞానం పొందే మార్గం కంటే, ఆ జ్ఞానమేమిటో వివరించ డానికే ప్రాధాన్యం ఇవ్వడం చూస్తాము. కోరికలు, నిర్మోహత్వం రెండూ, రెండు భిన్న ధృవాలు. బంధాల నుండి ముక్తి ఎలా లభిస్తుంది? భక్తి శ్రద్ధలతో సత్యాన్వేషణ చేసే ముముక్షువులు, భగవాన్ ఉపదేశాలు అందుకోవడానికి అర్హులు. స్వానుభవం

ద్వారానే తప్ప, పాండిత్యం ద్వారా ఆత్మ సాక్షాత్కారం లభించడం కల్ల.

భగవాన్‌ను శరణుజొచ్చిన అభాగ్యుల ఆర్తి, జిజ్ఞాసువుల సందేహాలు, వారిని పరీక్షింప వచ్చిన సంశయాళువుల అవిశ్వాసం, వారిని సందర్శించ వచ్చిన గొప్పవారి గర్వం - ఇవన్నీ వారి సన్నిధి జొచ్చినంత మాత్రాన పటాపంచలవుతాయి. ఆ పుణ్యధామంలో అడుగిడినంత మాత్రాన మనస్సు శాంతిమయమవుతుంది. ఆధ్యాత్మిక పారవశ్యానికి లోనవుతుంది. స్వరూపజ్ఞానమనే పరమానందం అనుభవానికి వస్తుంది. జ్ఞాన స్వరూపమైన దక్షిణామూర్తి దివ్యానుగ్రహం, మహర్షుల ద్వారా నాబోటి అల్పులైన భక్తులపై సైతం ప్రసరిస్తుంది. అటువంటి జ్ఞాన సంపన్నుల కథామృతం గ్రోలాలని ఎవరు మాత్రం కోరుకోరు?

ప్రాపంచిక బంధాలలో, అహంకార పూరితమైన అనుబంధాల సుడిగుండంలో చిక్కుకొని, అంధ వ్యామోహమనే బురదలో కొట్టు మిట్టాడుతున్న వారికి మాత్రమే కాక, ముముక్షువులకు, ముక్త జీవులకు సైతం, భగవాన్ సంకీర్తనం ఆనందదాయకము, ప్రయోజనకరము కూడా. అటువంటి మహాజ్ఞాని సమకాలికులుగా జీవించడం మనం చేసుకొన్న పుణ్యం. వారి సన్నిధికి నోచుకున్న భక్తులు భాగ్యశీలురు.

మహర్షి జీవితం ఒక వ్యక్తి జీవితం కాదు. విశ్వ చైతన్యం యొక్క దివ్య ప్రకాశం. ఒక భౌతిక దేహం చేసిన పలు కర్మల బాహ్య వ్యక్తీకరణ కాదు, అంతరంగంలోని దివ్యాత్మ సాక్షాత్కారమే.

******

## శ్రీ రమణ యోగ సూత్రాలు (కృష్ణభిక్షు వివరణ సహితము)

**1. ఆత్మ నిష్ఠో భవ "తను" లో స్థిరపడుము.**

"తాను" అనగా జాగ్రతలో గాని స్వప్నములోగాని సమాధి దశలు రెంటిలో గాని తనకన్న వేరే తోచని మూల వస్తువు. నిద్రా కాలములో ఆ వస్తువును తమస్సావరించి యున్నందున ఏదియు గోచరించదు. ఆ "తాను"లో స్థిరపడుము. అనగా, మరల బయటికి రానట్లు. ఈ సూత్రవాక్యము, సాధన యొక్క ప్రయోజనమును ఫలమునుగూడ నిర్ణయించుచున్నది. ఈ సూత్రము చేత దేవతా, వైకుంఠాది సూక్ష్మలోక, దివ్యశక్త్యాదిక ప్రాప్తులన్నియు పరిహరింప బడుచున్నవి.

**2. హృది విశ - హృదయములో ప్రవేశింపుము.**

ఆత్మనిష్ఠుడగుటకు మార్గములుపదేశింపబడుచున్నవి. అన్నిటికి మొత్తముగా ప్రయోజనము ఒకటే, హృదయ ప్రవేశము. హృదయ ప్రవేశ మాత్మనిష్ఠకు మొదటి మెట్టు. 'హృత్' అనగా అన్నిటిని అపహరించునది, అనగా అన్నియు దేనిలో లయము పొందునో అది. అన్నియును మనకు తలపుల మూలముననే తెలియుచున్నవి. ఈ తలపులే మనకు ప్రపంచము. ఈ తలపులు ఎక్కడుండిపోవునో అది హృత్. మనసు, ఇంద్రియములు, ప్రపంచము, ఏమియు తోచనపుడు చీకటిగానే ఉండునుకదా!

పై నిర్వచనమును బట్టి 'హృత్' అనగా రక్తమును ప్రసారము చేయు హృదయము కాదనియు, భాగవతమున చెప్పిన అనాహత చక్రముగాదనియు, ఆజ్ఞాచక్రముగాదనియు, సహస్రారము కూడ కాదనియు తేలుచున్నది.

హృదయమనగా అవయవము కానందున దానికి చోటు చెప్పుటకు వీలు లేదు. కాని ఉపాధిలో అనగా శరీరములో వక్షః స్థలమున కుడి భాగమున మొదట 'చిత్' స్ఫురించుచున్నదని భగవానులు చెప్పినారు. ఇంతకును ప్రధానాంశము తలపులు ఎక్కడుండవో అది 'హృత్' అని; దానిలో ప్రవేశింపవలెను. అప్పుడు అక్కడ ఏమియు గోచరించదు. శూన్యముగా, చీకటిగా తోచును.

**3. పవన చలన రోధాత్ - ప్రవేశించుటకు మార్గము గాలి (ఊపిరి) కదలిక లేకుండునట్లు చేయుట.**

ఈ కదలిక లేకుండ పోయిన యెడల మనస్సు కూడా లేకుండ పోవునని భగవాన్ చెప్పినారు. ''ప్రాణరోధనాత్ లీయతే మనః'' - కుంభక స్థితియందు ప్రాణము లీనమగుటచే, ఊపిరి రాకపోకలు లేనందున తలంపులునూ ఉండవు.

**4. సతత ప్రత్య వేక్షణాత్ - ఎప్పుడును ఊపిరి చూచుట వలన.**

ఊపిరిని కదలిక లేకుండునట్లు చేయు నుపాయమును దీనిలో చెప్పుచున్నారు. ఊపిరి కదలికను చూచుట చేతనే దాని వేగమును, దానితో పాటు తలంపుల వేగమును, తగ్గిపోవును. ప్రత్యవేక్షణమనగా ఆ కదలికను చూచుటయే. ఎప్పుడును ఊపిరి కదలికను చూచుచుండిన యెడల ఆ కదలిక నిలిచిపోవును.

''కుంభకం సిద్ధ్యతి హ్యేవం'' - కుంభకము సిద్ధించును. మనస్సు కూడ నిలిచిపోవును. ఆ స్థితిలో ప్రపంచము స్ఫురింపదు. చీకటిగనుండును. దీనినే బౌద్ధులు శూన్యమనిరి. శూన్యమనగా ఆత్మ నిష్ఠ కాదు. అదియే యిది అని వాదించుటకు మూలము అనుభవశూన్యతయే!

**5. మనసా స్వం చిన్వతా - మనస్సు చేత తన్ను వెదకుచు**

ఇంకొక ఉపాయమును చెప్పుచున్నారు. ‘‘మనస్సుచేత తన్ను తా వెదకుట.’’ దీనిలో రెండు మార్గములు ఉన్నవి.

(1) తలపులకు ఆధారమైన ‘‘నే నెవడను’’ అని వెదకుట. వృత్తి రాగానే ‘‘ఎవరికి వచ్చినది’’ అని ప్రశ్నించిన ‘‘నాకు’’ అని బదులు వచ్చును... ‘‘నేను ఎవరు’’ ప్రశ్నించిన, ఏమియు గోచరించదు. ఆ గోచరింపని స్థితిలోనే మరు తలంపు వచ్చు వరకు నిలిచి పోవుట కుంభకమే. కుంభకములో సిద్ధించిన వృత్తి శూన్యతయే ‘‘నేను ఎవడను?’’ అను ప్రశ్నకును ఉత్తరముగా వచ్చును.

(2) రెండవ మార్గము - ఏ తలంపు వచ్చినను, ‘‘ఎందుండి వచ్చినది? దానికి మూలమేమి?’’ అని దాని మూలమును వెదకుటయే. ఆ వెదికి నపుడును ఏమియు గోచరింపని వృత్తి శూన్యతయే మిగులును.

‘‘స్వం’’ అనగా ‘‘ఆత్మను’’ గాదు. ‘నేను’ వృత్తియే. దానికే అహంకారము, జీవుడు, అని పేరు. దాని గూర్చిన అన్వేషణమే రమణుని ఉపదేశము. ఈ అన్వేషణ ఫలము మొదట ఈ ‘‘నేను’’ అను వృత్తి పోవుట. ఈ వృత్తి పోయినగాని శూన్యముగాని, తరువాత అనుభవితమగు ఆత్మానుభవముగాని రాదు. మనసా అనగా: కొందరు ఈ ఆత్మాన్వేషణము మనోవ్యాపారము కాదని చెప్పు చున్నారు. పై వివరణముచే అది కేవలము మనోవ్యాపార మనియే తెలియుచున్నది. ఏ ఉపాసనా మార్గమునకును మనకున్న ఉపకరణము మనస్సే. ఇది శంకరుని పద్ధతి ప్రకారము ప్రతి తలంపును ‘నేతి’ అని త్యజించుట కాదు. తలపును పెట్టుకొనియే దాని మూలమును విచారించుట. *(సశేషం)*

# Self-Awareness

Dr K Subrahmanian

No sage or saint has ever declared that human beings will live without facing problems. As long as we are human beings, we will have problems. Meditation, *dhyana*, *japa* and *puja* will give us the strength to face our problems, but not always overcome them. During our waking hours, though we are aware of what is happening around us, we are only partially and not fully aware of what is happening, and therefore, our responses are rather mechanical. When the responses are mechanical, we give the impression that we are not interested in the other person, and that creates problems. When a person asks us why we said a particular thing, very often, our response is, "I am sorry! I don't know why I said what I did." Since we are not fully conscious of what we say, we regret something or the other we have said on a daily basis.

The difference between a *jnani* and people like us is that a *jnani* is self-aware; in other words, he is aware of everything that is happening. Every second, he is conscious of everything that he does, and there is nothing mechanical in what he says or does. We, on the other hand, are preoccupied mostly with ourselves, and are therefore, conscious of and interested in only a few things. So, when we confront a problem, the immediate response of the mind is, "How am I going to solve the problem?" We worry about the problem, and then apply, at most times, only a part of our mind to solve it. The entire mind is seldom

devoted to the problem; one part is applied to the solving of the problem, while the other is worried about the success or failure of the solution we arrive at. We know from experience that sometimes when we attack a problem, we lose ourselves in solving it. Later on, we realise that we were not conscious of the working of the mind. Once the problem is solved, we suddenly become conscious of the mind and the world around us.

When we are thinking of a solution to a psychological or a mathematical problem, we think of all the possibilities, and suddenly we see a kind of flash and a solution to the problem. We see both the flash and the solution simultaneously, and we think it is the result of the operation of the mind. Einstein, who had thought about mass and energy for several years, came up with his famous formulae - $e = mc^2$. Most of us think that as a scientist, he must have arrived at it step by step – in a logical fashion. This, however, was not the case. Einstein himself has said that the formula flashed across his mind as he was pushing his baby in a pram. He then rushed home and shut himself up in a room for six days in order to prove his theory. The same thing happens to all poets and artists. A particular line starts repeating itself in their head, and when they begin to work on it, the other lines gush out. It is a spontaneous overflow. It is not a conscious act of creation; it does not come in the form of line one or two. It just pours. This happened in the case of Bhagavan also.

*karunayalennai aanda nee enakkun*

These words kept ringing in his mind; he thought that maybe he should compose a verse. He composed a verse every day, and finally he ended by writing eleven verses. This is the true genius of all poets and *jnanis.*

